పెద్దవాళ్లను
అర్థం చేసుకోలేని
ఆమెకు
పిల్లల వలన
కలిగిన కనువిప్పు!

# జనరేషన్ గాప్

అర్చనా చౌదరి
కథ

"అబ్బబ్బా! బామ్మా! కాసేపు నీ సణుగుడు ఆపుతావా?" విసుగు కొద్దీ దాదాపు అరిచేశాను.

అది విన్న బామ్మ సణుగుడు ఆపలేదు సరికదా నా మీదికి రయ్యిన దూసుకువచ్చింది.


"అదేమిటే అమ్మాయీ! నా మాటలు నీకు సణుగుడులా వినిపిస్తాయా? ఏదో నీ మంచికోరి నేను చెపుతుంటే వినిపించుకోవేం? అసలు పెద్దవాళ్లంటే బొత్తిగా గౌరవం లేకుండా పోయింది. ఏం? ఇపుడు అంత దూరం ఒక్కదానివి రాత్రి, ప్రయాణం చేసి వెళ్లకపోతే ఏం కొంపలు అంటుకు పోతాయిట ఆ?"

బామ్మ ధోరణి అలా సాగిపోతూనే ఉంది. నేను మౌనంగా అమ్మకేసి చూసాను. నాకు కోపం వచ్చేస్తుందని గ్రహించింది కాబోలు, ఇక అమ్మ కల్పించుకోక తప్పింది కాదు.

"పోనివ్వండి అత్తయ్యా! అదేం చిన్నపిల్ల కాదు కదా! దాని బాగోగులు అది చూసుకోగలదు".

"సావిత్రీ! నువ్వు కూడా అది 'తాన అంటే తందాన' అంటావు. ఆడపిల్ల ఒకత్తి రాత్రి ప్రయాణం ఎలా చేస్తుంది? ఏమోనమ్మా! ఈ కాలం పిల్లల వైనమే ఇంత...! పెద్దవాళ్లంటే ఇసుమంత లక్ష్యం లేకుండా పోయింది. అదే మా కాలంలో అయితేనా...'
'

"ఇదో! ఇదే వద్దంటాను" నాకు ఉక్రోషం ముంచుకు వచ్చింది. "మాటి మాటికీ మాకాలంలోఅంటూ లేగరాగాలు



తీయబాకు. ఇపుడు మీ కాలం కాదు, కాలం మారింది. ఎపుడు అర్థం చేసుకుంటావోగా నీ నా ప్రాణాలు తింటున్నావు''.

''చూశావా సావిత్రీ? చూశావా దీని వరస '', బామ్మ కూడా ఉక్రోషంలో ఏమీ తీసిపోలేదు ''అసలు దీన్నని ఏం లాభం, దీన్నిలా పెంచాడు చూడు దీని బాబు, వాడిననాలి, వెధవ! ఆడపిల్లకు చనువిచ్చి

ఇలా తయారుచేశాడు''.

''మధ్యలో నాన్నను ఎందుకంటావు'' నేను దూకుడుగా ఇంకా ఏదో అనబోయేంత లో అమ్మ నన్ను కసిరింది.

''మధూ నువ్వూరుకో!'' అని బామ్మ వైపు తిరిగి ''అత్తయ్యా! మీకు దండం పెడతాను. మీరు దాని విషయంలో జోక్యం చేసుకోకండి. దయచేసి దాని మానాన దాన్ని వదిలేయండి'' అంది.

బామ్మ ఏదో అనబోయి మళ్లీ అమ్మ మొహం చూసి ఏమనుకుందో ఏమో వెనుతిరిగి సణుక్కుంటూ వెళ్లిపోయింది.

నేను ''అమ్మయ్య!'' అనుకుని తిరిగి నా సూటుకేసు సర్దుకోసాగాను.

''అది కాదు మధూ! బామ్మ చెప్పేదాంట్లో తప్పేముందీ? నాలుగు రోజులు ఆగితే మీ నాన్నగారు వచ్చేస్తారు. అపుడు వెళ్దువుగాని'' అమ్మ కూడా మెల్లగా హితబోధ మొదలెట్టింది.

''అమ్మా! నువ్వు కూడా...''

''సర్లే! సర్లే! నీ ఇష్టం వచ్చినట్లు కానివ్వు'' అనేసి అమ్మకూడా వెళ్లిపోయింది.

వీళ్ల నస ఏంటో నా కర్థం కాదు. అరే! నేనేమైనా చిన్నపిల్లనా? పుష్కలంగా పాతికేళ్లు నిండినదాన్ని. ఏమీ తెలియని పల్లెటూరి వాజమ్మనీ కాను. హైదరాబాదులాంటి మహా నగరంలో (?) బ్యాంకు ఉద్యోగం వెలగబెడ్తున్నాను.

సుధక్క బెంగుళూరువెళ్లి అయిదేళ్లవుతోంది. అప్పట్నించి తనని చూడడమే కుదరలేదు. అక్క రమ్మని ఎన్నిసార్లు రాసిందో! ఇపుడు అనుకోకుండా వారం రోజులు సెలవు దొరికిందని వెళుతున్నాను. నా బాధ అర్థం చేసుకోరేం?

బెంగుళూరు ట్రైను రాత్రిపూట ఉండటం నా తప్పా? ఆలోచిస్తూనే పాకింగ్ పూర్తి చేసాను.

సాయంత్రం నాలుగవుతోంది. ట్రైన్కు ఇంకా గంట మాత్రమే టైవ్ఁ ఉంది.

గబగబా భోజనం అదీ చేసి బయలుదేరాను.

బామ్మ పుణ్యమా అని బెంగుళూరు వెళ్తున్న ఎక్సయిట్మెంట్ అంతా ఆవిరయిపోయింది.

ట్రైన్లో కూర్చున్నాక కూడా అమ్మ వంద జాగ్రత్తలు చెప్పింది. అమ్మ పడుతున్న కంగారు చూసి నాకు కొంచెం బాధగా అనిపించింది.

''ఫర్లేదమ్మా! నేను జాగ్రత్తగానే ఉంటాను. ఏముందీ! ఇక్కడ నిద్రపోయి కళ్లు తెరిచేసరికి బెంగుళూర్లో ఉండనూ? ఎలాగూ అక్కకి టెలిగ్రాం ఇచ్చాం కదా. వాళ్లు స్టేషన్కి వస్తార్లే. నువ్వు అనవసరంగా కంగారు పడకు'' అమ్మకు ధైర్యం చెప్పాను.

''అయినా మధూ! నీ మంకుపట్టు విడువవు కదా! మీ నాన్నగారు వచ్చి ఏమంటారో'', అమ్మ బేలగా అంది.

''ఏమీ అనరులే. ఇంక నువ్వు ఇంటికి వెళ్లు, బామ్మ ఒక్కర్తే వుంది''.

అయినా ట్రైన్ కదిలేవరకు అమ్మ వెళ్లలేదు. ఆ ముఖంలో కంగారు పోనూ లేదు.

ట్రైన్ క్రమంగా వేగం అందుకుంది. నేను పరధ్యాసగా కిటికీలోంచి చూస్తూ కూర్చున్నాను. నా ఆలోచనలు బామ్మమీదకు మళ్లాయి.

అసలు బామ్మకు నాకు క్షణం పడదు. ఇది నాకు ఊహ తెలిసినప్పట్నించి జరుగుతూనే ఉంది. ఒక్కతే కూతుర్ని కావడం వల్ల నాన్న నన్ను గారాబంగా పెంచారు. అంతేకాదు స్వతంత్రపు భావాలు కూడా మాగా అలవర్చారు. బామ్మకిది అస్సలు నచ్చదు.

మా పెద్దనాన్న కూతురైన సుధక్క కూడా చదువు నిమిత్తం మా దగ్గరే ఉండేది. నాకు తనకు పదేళ్ల తేడా ఉన్నా, బాగా కలిసిమెలిసి ఉండేవాళ్లం.

నా పదేళ్లప్పుడు అనుకుంటా, సుధక్క పెళ్లి అయిపోయింది. వాళ్ల అత్తవారు కూడా హైదరాబాదే కావడంతో అప్పట్లో మాకు ఏమీ తేడా అన్పించలేదు.
నేను పెరుగుతున్నకొద్దీ నాకుసుధక్కతో చనువు, ప్రేమ కూడా పెరుగుతూ పోయాయి. తను బెంగుళూరు వెళ్లినప్పట్నించి తనకి ఇంటి గొడవలతో, నాకు చదువు గొడవలతో మొత్తానికి కలవడం కుదర్లేదు. ఇదిగో ఇన్నాళ్లకు ఈ విధంగా కుదిరితే ఒక్కదానివి వెళ్లకు అని బామ్మ గొడవ.

సమయానికి నాన్న కూడా టూర్‌కి వెళ్లారు. నాకు దొరికిన వారం సెలవుల్లో నాలుగు రోజులు నాన్న కోసం ఎదురు చూసినట్లయితే ఇంతే సంగతులు!

పోనీ బామ్మను తోడుగా రమ్మంటే తనకి నడుం నొప్పులు, కీళ్ల నొప్పులు అంటుంది. బామ్మను ఒంటరిగా వదిలేసి అమ్మ కూడా రాలేదు. ఏమయినా అంటే ఈ కాలం పిల్లల మీద విరుచుకుపడిపోతుంది బామ్మ.

కదిపితే చాలు. ఈ కాలం పిల్లల వరసే ఇంత, నమ్రత, అణుకువ అసలు లేవు. మాట వినరు, అదే మా కాలంలో అయితేనా అంటూ దీర్ఘాలు తీస్తుంది.

## జైలుశిక్ష

ఉత్తరప్రదేశ్‌లోని బాలూన్ అనే గ్రామంలోని రామచంద్ర అనే వ్యక్తిని హత్యాప్రయత్నం నేరంపై 1952 మార్చి 5న అరెస్టు చేసారు. అప్పటి నుండీ అతడు ఏ విచారణకూ నోచుకోకుండా జైలులో మగ్గుతున్నాడు. అతడిపై ఎందుకు విచారణ జరగలేదంటే ఈ కేసుకు సంబంధించిన రికార్డులు దొరకలేదట.

– డాక్టర్ అల్లా



ఈ దీర్ఘాలునా చిన్నప్పట్నించి వింటూనే ఉన్నాను, ప్రతిఘటిస్తూనే ఉన్నాను.

ఏదో యాభై సంవత్సరాల క్రింద వాళ్లు ఎలా ఉన్నారో మమ్మల్ని కూడా ఇపుడు అలా ఉండమంటే ఎలా?

జనరేషన్ గ్యాపండి బాబూ జనరేషన్ గ్యాప్!

"ఎక్కడిదాకా అమ్మాయీ ప్రయాణం?–"

ప్రశ్న విని ఇటు తిరిగాను. నా ప్రక్కన కూర్చున్న ముసలావిడ అడుగుతోంది.

"బెంగుళూరు దాకా" చెప్పాను.

"ఆహ! ఒక్కదానివేనా?" ఆవిడ మొహంలో బోల్డంత కుతూహలం, అంతకు మించిన ఆశ్చర్యం!

'ఈవిడకు ఎందుకో' అనుకుంటూనే 'అవునండి' అన్నాను.

"ఎంత విడ్డూరం! వయసులో వున్న పిల్లవు ఇలా ఒంటరిగా రాత్రి ప్రయాణం చేస్తున్నావా? అయినా ఈ కాలం పిల్లలే ఇంతలేమ్మా! అదే మా కాలంలో అయితేనా..."

మొదలెట్టింది మహాతల్లి! నేను గిరుక్కున కిటికీకేసి తిరిగాను. ఆవిడ ఇంకా ఏదో అంటూనే ఉంది.

చెప్పొద్దూ! నా రక్తం సలసలా మరిగిపోయింది.

ప్రతి విషయానికి మా కాలమో అంటూ డబ్బా కొట్టుకుంటూ ఉంటారు. ఏవిటో అంత బోడి గొప్పకాలం.

"అదేమిటమ్మాయి! ఏదో పెద్దదాన్ని. నా మటుకు నేను మాట్లాడుతూనే ఉన్నాను. నువ్వటు తిరిగావేం?" ఆవిడ నా భుజం పట్టుకుని కుదిపేసి మరీ అడుగుతోంది.

నేను ఘాటుగా ఏదైనా చెప్దామని ఇటు తిరిగాను, ఇంతలో ఆవిడ భర్త కాబోలు, అటువైపు కూర్చున్న ముసలాయన ఏదో అనడంతో ఆవిడ ధ్యాస అటు మళ్లింది.

"రక్షించావు దేవుడా!" అనుకున్నాను.

ఆ విధంగా నా బెంగుళూరు ప్రయాణం కాస్త అసంతృప్తికరంగానే సాగిందని చెప్పాలి.

మొత్తానికి తెలతెలవారుతుండగా ట్రైన్ బెంగుళూరు చేరింది. అక్క, బావలను చూసి నేను ఉత్సాహంగా ట్రైన్ దిగాను. అక్క ఒక్క ఉదుటన వచ్చి నన్ను వాటేసుకుంది.

"మధూ! ఎంత మారిపోయావ్" అంది.

"ఏం మధూ! ప్రయాణం బాగా జరిగిందా?" బావగారు నా సూట్‌కేసు తీసుకుంటూ అడిగారు.

"ప్రయాణం గురించి అడక్కండి" నేను నవ్వుతూ అన్నాను. "ఆదిలోనే హంసపాదు అన్నట్లు నేను ఒంటరిగా బయలుదేరతాననేసరికి బామ్మ మహాభారతం మొదలెట్టింది. వచ్చేప్పుడు నాతో మాట్లాడలేదు తెల్సా?"

"నీకూ, బామ్మకు ఎప్పుడూ ఉండేదే కదా" అక్క నవ్వి అంది.

దారి పొడుగునా అక్కకు, నాకు ముచ్చట్లే! అయిదేళ్ల కబుర్లామె!

అక్క వాళ్లిల్లు నాకు చాల నచ్చింది.

స్నానం అదీ కానిచ్చి నేను వచ్చేసరికి బావగారు ఆఫీసెళ్ళిపోయారు.

"ఇల్లు చాలా బావుందక్కా!" కాఫీ అందుకుంటూ అన్నాను.

"ఇంతకీ శ్రావ్య ఏదీ?" శ్రావ్యంటే అక్క ఏకైక కూతురు.

"ట్యుటోరియల్ వెళ్లింది" అక్క టేబిల్ మీద టిఫిన్ సర్దుతూ చెప్పింది.

"ఇపుడు టెన్త్‌లో ఉందేమో కదూ! మై గుడ్‌నెస్! అక్కా! నీకు ఇంత పెద్దకూతురా?"

నేను ఇంకా ఏదో అనబోయేంతలో దడదడామని శబ్దం, దాంతో పాటే భళ్ళున తలుపు తెరుచుకొని శ్రావ్య వచ్చి పడింది.


నాకు ఒక్క క్షణం ఏమనాలో తోచలేదు ఈ అయిదేళ్లలో నమ్మశక్యంకాని మార్పు వచ్చింది శ్రావ్యలో.

ఆమె స్కూల్ డ్రెస్‌లో ఉన్నట్టుంది. కాని నాకది స్కూల్ డ్రెస్‌లా అనిపించలేదు ముదురు ఎరుపు రంగులో ఉన్న స్కూల్ స్కర్ట్, మినీ స్కర్ట్‌ని గుర్తుకు తెస్తోంది. పై రెండు బటన్స్ వదిలేసి వేసుకున్న వైట్ ఫుల్ స్లీవ్స్ షర్ట్‌లోంచి సన్నని గోల్డ్‌చైన్ మెరుస్తోంది. షర్ట్ కాలర్ని దాటటానికి ప్రయత్నిస్తున్న చిన్న పోనీటైల్. తైల సంస్కారం లేక మొహం మీదికి చిందరవందరగా పడుతున్న జుత్తు. ఒక్కమాటలో చెప్పాలంటే చాలా 'అనటైడీ'గా అనిపించింది.

నాకు అప్రయత్నంగా నా స్కూల్‌డ్రెస్ గుర్తొచ్చాయి. నేను కూడా కాన్వెంటులోనే చదివాను. కాని స్కూల్ డ్రెస్ అంటే మోకాళ్ల దాటి జీరాడే స్కర్ట్, టై, బెల్ట్, బాగా నూనె పట్టించి రిబ్బన్లలో పైకి మడిచి కట్టుకున్న జడలు, మెరిసే నల్లని లెదర్ షూస్‌తో నీట్‌గా ఉండడం.

ఇది ఈ అమ్మాయి వేసుకున్నది స్కూల్ డ్రెస్సా?

"హలో మధూ ఆంటీ! చూశారా గుర్తు



పట్టేశాను'', శ్రావ్య నన్ను విష్ చేస్తూ వెళ్లి కూర్చుంది.

''హలో!'' అన్నాను.

ఆ అమ్మాయి మొహంలో ఇంకా పసితనపు ఛాయలు వీడలేదు గాని ఆమె నడకలో ఒకలాంటి గ్రేస్, ఒకలాంటి మెచ్యూరిటీ ఉంది.

''శ్రావ్యా! మీకు టై, బెల్ట్ ఉండవా?'' ఉండబట్టలేక అడిగేశాను.

''ఉంటాయి'', శ్రావ్య నన్ను చిత్రంగా చూసి అంది. ''స్కూల్లో పెట్టుకుంటాము''.

అంతలో అక్క మా ఇద్దరి ముందు ఇడ్లీ, కారంపొడి పెట్టింది. ప్లేటులో ఇడ్లీ చూడగానే శ్రావ్య మొహం చిటపటలాడింది. ఆ తర్వాత ఉన్నట్టుండి గబగబా ఇడ్లీ నోట్లోకి కుక్కడం మొదలుపెట్టింది. ఆమె తిండి చూసి నేను హడలిపోయాను.

''అదేమిటలా... '' నా మాట ఇంకా పూర్తి కావేలేదు, తను గబగబా మంచినీళ్లు తాగి విసురుగా

''ఈ గడ్డిని ఇంకెలా తినమంటారు?'' అడిగింది.

నేను అక్కకేసి చూసాను.

''దీనికి నా వంట నచ్చదులే'' అక్క నిర్లిప్తంగా అంది.

''పోనీ కాంటీన్లో తింటావంటే డబ్బులివ్వదు,'' శ్రావ్య ఫిర్యాదు.

అక్క మాట్లాడకుండా వెళ్లి పాలగ్లాసు తెచ్చిచ్చింది.

'మమ్మీ!ఐహేట్ మిల్క్'', శ్రావ్య మొహం మాడ్చుకుని తాగడం మొదలెట్టింది.

ఆమె తీరుచూసి నాకెంత కోపం వచ్చిందంటే, అక్క స్థానంలో నేనుండి ఉంటే రెండు అంటించేదాన్ని.

మొత్తానికి అక్క కసరడంతో తను మారు మాట్లాడకుండా పాలు తాగింది.

ఉన్నట్టుండి నా దృష్టి శ్రావ్య చేతిగోళ్ల మీద పడింది. అంగుళం పొడుగున్న గోళ్లను చూసి నేను హడలిపోయాను.

''మీ స్కూల్లో గోళ్లు ఎలా పెంచనిస్తారు ? చెక్ చేయరా?'' ఆశ్చర్యంగా అడిగాను.

''చేస్తారు. కాని ఇప్పుడు మేము టెన్త్ కదా! గోళ్లు పెంచినా ఎవరూ చూడరు'' అంది నిర్లక్ష్యంగా.

''బైదివే మమ్మీ! నేను వచ్చేటప్పుడు పార్లర్కి వెళ్లొస్తాను. హెయిర్ స్ట్రెయిట్ చేయించాలి'', అని నాకో ఫైనల్ షాకిచ్చేసి వెళ్లిపోయింది.

తర్వాత రెండు రోజులు నేను శ్రావ్య అలవాట్లకి ఆశ్చర్యపోకుండా ఉండడానికి ప్రయత్నిస్తుండిపోయాను. తనకి చదువు తక్కువ, స్టయిల్స్ ఎక్కువ.

మూడోరోజు షాపింగ్ చేసి వచ్చి తనకి తలనొప్పిగా ఉందని చెప్పి అక్క వెళ్లి పడుకుంది. శ్రావ్య ఇంకా స్కూల్ నించి రాలేదు. నేను బాల్కనీలో కూర్చుని ఏదో మాగజైన్ తిరగేస్తున్నాను.

ఇంతలో గేటు ముందు బైక్ ఆగిన శబ్దానికి తొంగి చూసాను. శ్రావ్య ఎవరో అబ్బాయి బైక్ మీంచి దిగి 'బై' చెప్పి లోపలికి వస్తోంది. నేను స్థాణువైపోయాను.

ఈ అమ్మాయి వయసెంతని! మహా ఉంటే పదిహేనేళ్లు! ఈ వయసులో ఇలా!

మైగాడ్‌ఫ

"ఆంటీ! మమ్మీ ఎక్కడ?" శ్రావ్య అడుగుతోంది.

"శ్రావ్యా! ఇలా రా!" పిలిచాను.

వచ్చింది.

"కూర్చో" అన్నాను..

ఆ అబ్బాయెవరు?" కాస్త కరుకుగానే అడిగాను.

"అతనా! విపిన్! మా స్కూల్ బస్ పాడయితే లిఫ్ట్ ఇచ్చాడు" లైట్‌గా చెప్పింది.

"స్కూల్ బస్ పాడయితే ఆటోలో రావచ్చు. అంతేకాని ఇలా ఎవరిదో బైక్‌మీద రావడం తప్పు. చూడు శ్రావ్యా! నేను కూడా 'కో ఎడ్‌లోనే' చదివాను. మా బస్ కూడా పాడయ్యేది. కాని నేనెప్పుడూ ఇలా..."

"ప్లీజ్!" శ్రావ్య విసురుగా లేచింది, "మీ మాటలు రెండు రోజుల్నించి వింటూనే ఉన్నాను. కానీ ఆంటీ! పదేళ్ల క్రింద మీరు ఎలా ఉన్నారో యిప్పుడు నన్ను కూడా అలా వుండమంటే ఎలా? నా ప్రతి విషయము మీకు నచ్చట్లేదు. ఇట్స్ ఓకే. అది మీ తప్పు కాదు. దటీజ్ జనరేషన్ గ్యాప్"!

నేను ఎప్పుడూ బామ్మతో అనే మాటలు ఆ అమ్మాయి నాకే అప్పచెప్తుంటే... నేను నోరు తెరుచుకుని చూస్తుండిపోయాను. నా కళ్లముందు ఒక తెర తొలిగినట్లయింది. పదేళ్లలో వచ్చిన మార్పులనే నేను తట్టుకోలేకపోతే యాభై ఏళ్లలో వచ్చిన మార్పులను పాపం బామ్మ మాత్రం ఎలా తట్టుకోగలదు? బహుశా వాళ్ల బామ్మ కూడా బామ్మతో మా కాలమో అంటూ దీర్ఘాలు తీసేదేమో. నేను కూడా భవిష్యత్తులో నా మనమలతో మా కాలమో అంటూ మొదలెడ్తానేమో!

నిజమే సుమా! జనరేషన్ గ్యాప్!

*



## సమస్య

ఓ కుర్రపిల్ల సైకియాట్రిస్ట్ డాక్టర్ కాంబాబు దగ్గరికి వచ్చింది. డాక్టర్ తలుపువేసేసి ఆ అమ్మాయి వెంటపడ్డాడు., గదంతా తిప్పితిప్పి చివరకు డాక్టర్ ఆమెను పట్టుకొని సోఫాలో విసిరివడేశాడు. కొంచెంసేపు ఆమెపైపడి ఆబగా ముద్దులు పెట్టుకొని, ఆ తర్వాత

"ఆ.. ఇప్పుడు చెప్పమ్మా. నా సమస్యలు పరిష్కారమయ్యాయి. నీ సమస్యలేమిటి!" అని అడిగాడు డాక్టర్ కాంబాబు.

– పద్మావతిదేవి (నిమ్మబోలు)